తలసానికి భారీ మెజారిటీ ఖాయం

బూత్ ఏజెంట్ల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 12 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల కోసం అమలు చేస్తున్న అద్భుతమైన ప్రజా సంక్షేమ పథకాలను వివరించి, బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం పద్మారావునగర్‌లో నూతన ఆఫీస్ వద్ద పోలింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడుతూ, నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించేలా పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు ఏసూరి మహేశ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్, అంబులెన్స్ సురేశ్, ముక్కశ్రీను, హరిచారి, కుమార్ యాదవ్, సదానంద్, రవి, భాస్కర్, కృష్ణ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

31 వరకు ఓటరు నమోదు

పలు పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్వో రవి

జూబ్లీహిల్స్,అక్టోబర్12: అక్టోబర్ నెలాఖరు వరకు నూతన ఓటరు నమోదు, చిరునామాల మార్పుల ప్రక్రియ కొనసాగుతుందని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి వెల్లడించారు. పక డ్బందీ ఓటరు జాబితా కోసం చిరునామాలు మారిన వారి వివరాలు, చనిపోయిన వారి వివరాలు తెలియచేయాలని సూచించారు. గురువారం అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డీఎంసీ సేవా ఎస్లావత్, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఏఈఆర్‌ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీ కమల్, తహసీల్దార్ నయీముద్దీన్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి నిగమంలో సిల్క్ ఎక్స్‌పో

సత్యసాయి నిగమం నందు ప్రారంభమైన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలో 14 నగరాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో ఏర్పాటు చేశారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బగల్‌పూర్, కాంతాపర్క్స్ , బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లెనిన్ శారీస్, కళంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్ బ్లౌజులు, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాధీ మెటీరియల్, 1 గ్రాం గోల్డ్ జ్యువెల్లరీ వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 15వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. –వెంగళరావ్‌నగర్ అక్టోబర్ 12:

నిందితుడు పారిపోయిన ప్రచారం అవాస్తవం

వెంగళరావునగర్: ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ కస్టడీ నుంచి ఓ నిందితుడు పారిపోయినట్లు ప్రచారం జరిగింది. అటువంటిదేమీ లేదని.. అంతా అవాస్తవమని పోలీసులు తెలిపారు. బుధవారం క్రైం సిబ్బంది పని తీరును డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రఘురాములు పర్యవేక్షిస్తున్న సమయంలో ఓ నిందితుడు అదను చూసి పారిపోయాడని ప్రచారం జరిగింది. ఈ విషయమై డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రఘురాములు ఇదంతా అవాస్తవమని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ రామప్రసాదరావు మాట్లాడుతూ సెల్ ఫోన్ చోరీ కేసులో విచారణకు వచ్చిన నిందితుడు రెండో అంతస్తు నుంచి కిందకు దిగి అక్కడే కూర్చున్నాడని, ఎక్కడికి వెళ్లలేదని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- బీఆర్ఎస్‌కు కంచుకోటగా జూబ్లీహిల్స్
- బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్,అక్టోబర్ 12: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తనదే అని, ఇదే విషయాన్ని గురించి ప్రజలకు భరోసా కల్పించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ కార్యకర్తలను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే ప్రచారాస్త్రాలుగా రానున్న ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా మార్చడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించారన్నారు. పదేళ్లుగా నిరంతరం ప్రజల సమస్యలు తీర్చడం ద్వారా వారికి అత్యంత ఆప్తులుగా మారిన బీఆర్ఎస్ కార్యకర్తలు మరో 48 రోజులు కష్టపడితే భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని పేర్కొన్నారు. పదేళ్లలో ఏనాడు ప్రజల ముఖం చూడని నాయకులంతా రానున్న 48రోజులు నియోజకవర్గంలో టూరిస్టులుగా వస్తుంటారని, అలాంటి వారి మాటలు పట్టించునే పరిస్థితిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు లేరన్నారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా ఓటర్ జాబితాలను ఆయా బూత్‌ల ఇన్‌చార్జిలకు ఎమ్మెల్యే మాగంటి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, నాయకులు గంట మల్లేశ్, సర్దార్,రూపేశ్, శ్రీకాంత్, శ్రవణ్, బాలకృష్ణ, రఘు, కళ్యాణి, సుజాత, ఉష, బాలమణి, రాజమణి, సునీత, రజియా, మణి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న చేయూత ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు

ఎర్రగడ్డ, అక్టోబర్ 12: సకల వసతులున్న ప్రభుత్వ బడుల్లో నేడు నాణ్యమైన విద్యాబోధన జరుగుతున్నదని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ఎస్పీవీ శరభయ్య అన్నారు. బోరబండలోని నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ 'చేయూత ఫౌండేషన్' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శరభయ్య మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురాదని.. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేత రాజు కామేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ తరపున 64వ వితరణ కార్యక్రమాన్ని నాట్కో పాఠశాలలో నిర్వహించటం.. 64 మంది ప్రతిభాన్విత విద్యార్థులకు కానుకలు, పతకాలు, ప్రశంసాపత్రాలతో పాటు పాఠశాల లైబ్రరీకి స్టడీ మెటీరియల్, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకించి ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేయటం సంతోషంగా ఉన్నదన్నారు. ఇవే కాకుండా పోర్టబుల్ ఆహుజా ఆంప్లిఫైర్‌ను కూడా ఇవ్వటం జరిగిందని వివరించారు. ఈ పాఠశాలకు చెందిన 6–10 తరగతుల బాలబాలికలు గ్రంథాలయంలో కొలువుతీరిన స్టడీ మెటీరియల్ ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ నాట్కో పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న 277 మంది విద్యార్థుల్లో ప్రతి ఒక్కరూ 9.5 పాయింట్లను వార్షిక పరీక్ష ఫలితాల్లో సాధించాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల తరపున సిబ్బంది కామేశ్వరరావు, వరలక్ష్మి దంపతులను సన్మానించారు. నాట్కో సంస్థ ప్రతినిధి వంశీ కృష్ణ, పవన్‌కౌండిన్య, హెచ్ఎం గీత పాల్గొన్నారు.

ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలి

ఈఈ రాజ్‌కుమార్‌తో కలసి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్

జూబ్లీహిల్స్,అక్టోబర్12: ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి అధికారులను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, యూసుఫ్‌గూడ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఎస్లావత్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్‌లలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లను గ్రౌండ్ ఫ్లోర్‌ల లోనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని 329 పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతులతో పాటు వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులతో పాటు ఈఈ రాజ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన స్కూల్లోనే వేతనాలు ఇవ్వాలి

వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్12: హైదరాబాద్ జిల్లాలో ఇటీవల బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్‌లతో పాటు ఈక్వల్ క్యాడర్ ఉపాధ్యాయుల అక్టోబర్ నెల వేతనాలు బదిలీ అయిన పాఠశాలల్లోనే ఇవ్వాలని పీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డితో కలిసి పీఏఓ హనుమంతుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బదిలీ ప్రక్రియలో జిల్లావ్యాప్తంగా 1500 మంది ఉపాధ్యాయులు కొత్త స్కూల్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఈ మేరకు పీఏఓ హనుమంతు నవంబర్ మొదటి తేదీన వేతనాలు వస్తాయని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో సనాతన ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. సనాతన ట్రస్ట్ మేనేజింగ్ శ్రీ ఎస్‌వీ సుబ్రమణ్యం సతీమణి దివంగత సందెపూడి పద్మశ్రీ సంస్మరణార్థం విద్యార్థులకు దసరా కానుకగా ఈ పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌వీ ట్రస్ట్ సుబ్రమణ్యం విద్యార్థుల ప్రగతిని ప్రశంసించారు. 350 మంది విద్యార్థులకు ఈ షూస్ పంపిణీ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నబత్తిని శౌరి తెలిపారు. –బేగంపేట్ అక్టోబర్ 12: